సాక్షి వరంగల్
ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



గంజాయి స్వాధీనం..
అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తొర్రూరు డీఎస్పీ రఘు తెలిపారు. - 8లో▸



పాకాలలో పర్యాటకుల సందడి
జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన పాకాలలో పర్యాటకులు సందడి చేస్తున్నారు. జంగిల్ క్యాంపింగ్‌లో బస చేస్తూ.. ట్రెక్కింగ్ చేస్తున్నారు. పాకాల అందాలను వీక్షిస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33.0^0/13.0^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 432 మంది క్యాన్సర్ బాధితులు

గీసుకొండ: జిల్లాలో పలు రకాల క్యాన్సర్లతో 432 మంది బాధపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 182 మంది బ్రెస్ట్ క్యాన్సర్, 130 మంది నోటి క్యాన్సర్, 120 మంది సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు క్యాన్సర్‌పై తమ సిబ్బంది, అధికారులు అవగాహన కలిగిస్తున్నారని, సరైన ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు వెంటనే సంబంధిత వైద్యాధికారుల వద్ద ఉచిత చికిత్స పొందాలని సూచించారు.

భాషోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి



నర్సంపేట రూరల్: భాషోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర భాషోపాధ్యాయుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అన్నారు. నర్సంపేటలోని జిల్లా పరిషత్ సెంకడరీ బాలుర పాఠశాలలో భాషోపాధ్యాయులు నల్లా బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు, పీఈటీలకు అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. బేషరతుగా ప్రభుత్వం వెంటనే పండితులకు, పీఈటీలకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్, తెలుగు, హిందీ విషయ నిపుణులు మహ్మద్ ముజీబ్ ఉర్ రహ్మాన్ పాల్గొన్నారు.

మంత్రితో చాంబర్ మీటింగ్ వాయిదా

వరంగల్ రూరల్: మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం సాయంత్రం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ 2023–24 సమావేశాలు కొనసాగుతుండడంతో ఈసమావేశానికి తాను హాజరు కావడం లేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులతో పేర్కొన్నారు. ఇదే విషయమై మంత్రి హైదరాబాద్‌లోని తన చాంబర్ నుంచి వరంగల్ మార్కెటింగ్ శాఖ అధికారి పాలకుర్తి ప్రసాదరావుకు, కలెక్టర్ బి.గోపికి, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ప్రతినిధులకు సమాచారం అందించారు.

జిల్లా కమిటీలో పలువురికి చోటు



నెక్కొండ: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీలో నెక్కొండకు చెందిన పలువురికి చోటు కల్పించినట్లు ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3న హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం జరిగిందని ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడిగా నెక్కొండ మండలానికి చెందిన మహబూబ్ నాయక్ తండా జీపీ కారో బార్ భూక్యా నరేశ్, జిల్లా కన్వీనర్‌గా నెక్కొండ జీపీకి చెందిన కార్మికులు సింగం హైమ, జిల్లా సహాయ కార్యదర్శిగా ఈదునూరి సాయిలు, జిల్లా కమిటీ సభ్యుడిగా మేరుగు మదార్‌ను నియమించినట్లు తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా కమిటీకి ఎన్నికైన వారు కృషి చేయాలన్నారు.

వేర్వేరు 'బార్' కార్యవర్గాలకు తీర్మానం

వరంగల్ లీగల్: హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వేర్వేరుగా బార్ అసోసియేషన్ల ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు పంపించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఏ.ఆనంద్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం బార్ అసోసియేషన్ భవనంలో ఆనంద్‌మోహన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. జనవరి 23న సుమారు 270 మంది న్యాయవాదులు అందజేసిన విజ్ఞాపన పత్రాన్ని కార్యవర్గం చర్చకు స్వీకరించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది జూన్ 2న హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వేర్వేరుగా జిల్లా కోర్టులు ఏర్పాటు చేయడం, ఒకే ప్రాంగణంలో విడివిడిగా పరిపాలన కొనసాగుతున్న దృష్ట్యా బార్ అసోసియేషన్లు కూడా వేర్వేరుగా ఉండటం న్యాయ సమ్మతమని న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని బార్ అసోసియేషన్ స్వీకరించింది. మేరకు తీర్మాన పత్రాలను బార్ కౌన్సిల్‌కు పంపించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

కొండా చూపు.. తూర్పు వైపు

వరంగల్ తూర్పు నుంచి పోటీపై స్పష్టత

- పాదయాత్రతోనే కొండా సురేఖ రీ ఎంట్రీ
- కొండా రాకతో ఈస్ట్‌లో మారనున్న రాజకీయం
- ఇప్పటికే జనాల్లో ఎమ్మెల్యే నరేందర్
- మరోవైపు బీజేపీని క్షేత్రస్థాయిలో బలపర్చడంపై 'ఎర్రబెల్లి' ఫోకస్
- ఈసారి త్రిముఖ పోరు!



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత కొండా సురేఖ తూర్పు నుంచి బరిలోకి దిగుతారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించారు. ఈనేపథ్యంలో రాజకీయ సమీకరణలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014లో వరంగల్ తూర్పు నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కొండా సురేఖ గెలిచారు. 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ విడుదల చేసిన తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి మారారు. పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆతర్వాత వరంగల్ తూర్పులో యాక్టివ్‌గా లేకపోయినా.. కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో అడపాదడపా పాల్గొన్నారు. దీంతో ఇన్నాళ్లు.. కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించే ముఖ్య నాయకుడు వరంగల్ తూర్పులో లేకపోవడంతో హస్తం శ్రేణులు ఉన్నామా.. అంటే ఉన్నాం.. అన్నట్లుగా పార్టీకి సంబంధించిన వివిధ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు.

రసవత్తరంగా రాజకీయాలు

ఈనెల తొమ్మిది నుంచి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గడప గడపకూ పాదయాత్రతో మళ్లీ ప్రజల నుంచి కొండంత అభిమానాన్ని దక్కించుకోవాలని కొండా సురేఖ ప్రణాళిక రచించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్రకు మద్దతుగా తూర్పులో పాదయాత్ర చేస్తామని కొండా మురళి ప్రకటించడంతో తూర్పులో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇన్నాళ్లు అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపే నాయకులు పెద్దగా కాంగ్రెస్‌లో లేకపోవడంతో హస్తం డీలా పడింది. తూర్పు నియోజకవర్గం అణువణువునా తెలిసిన కొండా సురేఖ పాదయాత్ర ద్వారా అన్ని వర్గాల మద్దతు కూడగడుతూనే ప్రజా సమస్యల్ని ఎత్తిచూపేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఇంకో వైపు ఇతర పార్టీల నుంచి చేరికలుంటాయని కొండా అనుయాయులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో తూర్పులో రాజకీయ వేడి మొదలైందన్న చర్చ జరుగుతోంది. ఇంకోవైపు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా జనహిత కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర పార్టీ నేతలను గులాబీ పార్టీలో చేరుస్తూ అభివృద్ధి నినాదంతో ఇప్పటికే జనాల్లో తిరుగుతున్నారు. ఇక బీజేపీ కూడా ఈసీటుపై గురిపెట్టడంతో బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మార్గదర్శకాల ప్రకారం కమలనాథులు ఏకతాటిపైకి వచ్చి పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. దాదాపు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకే టికెట్ అవకాశాలు ఉండడంతో ఆయన జనాలతో మమేకమవుతున్నారు. పార్టీలో సభ్యత్వాలు పెంచుతూ ముందుకెళ్తున్నారు. ఈముగ్గురు నియోజకవర్గంతో అనుబంధం ఉన్నవాళ్లే కావడంతో వచ్చే ఎన్నికలు రాజకీయాలు రసవత్తరంగా ఉండే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

శ్రేణుల్లో జోష్

కొండా కుటుంబం నుంచి ఒక్కరే పోటీ చేస్తారని, అది కూడా కొండా సురేఖ గతంలో పోటీ చేసి గెలిచిన వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉంటారని స్పష్టమైన ప్రకటన రావడంతో.. హస్తం శ్రేణుల్లో జోష్ పెరిగింది. బీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ద్వారా తమ సామాజిక ఓట్లను రాబట్టుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంప్రదాయక ఓట్లు అనుకూలంగా మలుచుకుంటే విజయఢంకా మోగించవచ్చన్న ధీమాలో ఉన్నారు. అయితే ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా బీసీ సామాజిక వర్గం కావడంతో పాటు బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తనకు కలిసొస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికే వివిధ కార్యక్రమాలతో జనాలను కలుస్తూ పాజిటివ్ వైబ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు టీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లి బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ క్షేత్రస్థాయిలో తిరుగుతున్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు వచ్చే ఎన్నికలకు గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన సమయంలో, టీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో అన్ని డివిజన్ల నేతలతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. ఇలా.. ముగ్గురు నేతలు ఈనియోజకవర్గం నుంచి పోటీ చేసిన వారే కావడంతో ఈ దఫా ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సల్లంగ సూడు తల్లీ.. మళ్లొస్తం

ముగిసిన మినీ మేడారం జాతర

సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



మండమెలిగె వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం ఘనంగా ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భక్తులు ఎత్తుబంగారం, ఎదురుకోడి, తలనీలాలు సమర్పించి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగురోజులు చెట్ల కింద విడిది చేసిన భక్తులు సల్లంగ సూడు తల్లీ మళ్లొస్తాం అంటూ తిరుగు ప్రయాణమయ్యారు. - ఎస్ఎస్ తాడ్వాయి - వివరాలు 8లో▸

ప్రజల్ని మోసం చేసిన కేసీఆర్

- వైఎస్సార్ టీపీతోనే రాజన్న రాజ్యం
- వైఎస్ షర్మిల



సంగెం మండలం కాపులకనిపర్తిలో ప్రజలతో మాట్లాడుతున్న షర్మిల

ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. శనివారం జిల్లాలో ప్రజాప్రస్థానం పాదయాత్ర సాగింది. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆమెకు మంగళ హారతులతో నీరాజనం పలికారు. - సంగెం/పర్వతగిరి - వివరాలు 8లో▸

'కంటి వెలుగు'లో వరంగల్ ఆదర్శం కావాలి

- కలెక్టర్ గోపి
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'కంటి వెలుగు'లో వరంగల్ జిల్లా ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కంటి వెలుగుపై మండలాల వారీగా కంటి వైద్య నిపుణులు, వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ... కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చేలా కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోజు 300 మంది అర్బన్ ఏరియాలో 400 మంది టార్గెట్‌గా నిర్దేశించినట్లు తెలిపారు. టాప్–3లో నర్సంపేట, గవిచర్ల, నారక్కపేట గ్రామాలున్నాయన్నారు. అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో క్యాంపులను పరిశీలించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ వంశీధర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు రుసుముతో 'పది' ఫీజు గడువు పెంపు

కాశిబుగ్గ సెంటర్: వెయ్యి రూపాయల అదనపు రుసుముతో పదోతరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 15 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 16న చలానా ద్వారా ఫీజు చెల్లించి 17న డీఈఓ కార్యాలయంలో నామినల్ రోల్స్ సమర్పించాలని సూచించారు.

పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ గోపి, ఎమ్మెల్యే పెద్ది
- మన ఊరు–మన బడి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి, చిత్రంలో ఎమ్మెల్యే పెద్ది, ఇతర అధికారులు

నర్సంపేట: నియోజకవర్గంలో మన ఊరు–మన బడి కింద మంజూరైన నిధులతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ గోపి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మన ఊరు– మనబడి, మన బస్తీ–మన బడి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 104 పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో 50 శాతం పనులు పూర్తయినట్లు, మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 94 పాఠశాలలు ఎంపికవగా.. ఇందులో 20 శాతం పనులు మాత్రమే పూర్తవగా.. మిగతా స్కూళ్లలో పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పుతున్న విద్యాలయాలను అభివృద్ధి పర్చడం మన బాధ్యతగా భావించాలన్నారు. నెల రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అదనపు పోషకాహారం

- అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెన్స్
- సేంద్రియ పద్ధతుల్లో పెంపకం





కూరగాయలను సేకరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, సేంద్రియ పద్ధతిలో పెంచిన ఆకు కూర

నల్లబెల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్స్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందుతోంది. సేంద్రియ పద్ధతులు అవలంబిస్తూ ఆకుకూరలు, కూరగాయలు పండించి అదనపు పోషకాహారాన్ని అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఒకపూట సంపూర్ణ భోజనంతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నారు.

అదనపు పోషకాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు వయస్సు, ఎత్తుకు తగిన బరువు ఉండట్లేదు. కొంతమంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు అధికారులు పోషణ మాసంలో సర్వేలో గుర్తించారు. ఈసమస్యలు అధిగమించేందుకు, అదనపు పోషకాహారాన్ని అందించేందుకు ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీకేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్‌కు శ్రీకారం చుట్టారు. నల్లబెల్లి మండలంలో 57 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. 34 అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతుల్లో ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. తాజాకూరలు వండి పెడుతుండడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతోంది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి ప్రోత్సహించడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆకు కూరలు, కూరగాయల మొక్కల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

సేంద్రియ పద్ధతుల్లో సాగు



అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు సేంద్రియ పద్ధతుల్లో పెంచుతున్నాం. పండించిన ఆకు కూరలు, కూరగాయలు వండి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పెడుతున్నాం. అదనపు పోషకాహారాన్ని అందిస్తున్నాం.
– వెంకటలక్ష్మి, టీచర్, నారక్కపేట

ప్రోత్సహిస్తున్నాం..



లబ్ధిదారులకు అదనపు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసేలా అంగన్‌వాడీ టీచర్లను ప్రోత్సహిస్తున్నాం. సమష్టి కృషితో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తున్నాం. నిర్వహణ బాధ్యతలు సిబ్బందే చూసుకుంటున్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– ఝాన్సీరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నల్లబెల్లి

మార్కెట్ సాధారణ సమావేశం

- ఆదాయం లెక్క చెప్పకుండానే రూ.7.5 కోట్లుగా చూపిన అప్పు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి

వరంగల్ రూరల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సాధారణ సమావేశాన్ని శనివారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గతేడాది ఆగస్టు 18 నుంచి ఈఏడాది జనవరి వరకు మార్కెట్‌కు వచ్చిన ఆదాయం లెక్క వెల్లడించలేదు. కానీ మార్కెటింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి జీతాల కోసం వివిధ మార్కెట్ల నుంచి రూ.7.5 కోట్లు అప్పు తెచ్చినట్లుగా చూపారు. రూ.8.56 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిపై సమావేశంలో చర్చించారు. మార్కెట్‌లో మౌలిక వసతులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. మార్కెట్ యార్డులో తమ యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని టీఎన్‌జీఓస్ ఉద్యోగుల సంఘం కోరింది. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, కమిటీ సభ్యులు గోలిరాజయ్య, పసునూరి సారంగపాణి, తుమ్మ రవీందర్, గనిపాక విజయ్‌కుమార్, పట్టాపురం ఏకాంతగౌడ్, పల్లెపాటి శాంతిరతన్‌రావు, కంది రవీందర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి పాలకుర్తి ప్రసాదరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శులు టి.చందర్‌రావు, ఎం.డి.బియాబాని, సహాయ కార్యదర్శులు జన్ను భాస్కర్, ఎం.డి లాషరీఫ్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్ష పడితే నేరం చేసేందుకు భయపడతారు: సీపీ

వరంగల్ క్రైం: నేరస్తులకు కోర్టులో శిక్ష పడితే మళ్లీ నేరం చేయడానికి భయపడతారని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల న్యాయస్థానాలకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, ఏసీపీలతో వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ రంగనాథ్ ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసులు కోర్టులో కొట్టుడు పోవడంపై గల కారణాలను పీపీలతో సమీక్షించారు. నిందితులకు కోర్టులో శిక్ష పడేందుకు పీపీలు, పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ న్యాయవాదులు, పోలీస్ అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి, ఈస్ట్‌జోన్ డీసీపీ ఎం.కరుణాకర్, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అజయ్, సీసీఆర్‌బీ ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రమేష్, కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

నర్సంపేట: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగ అభివృద్ధికి 30 శాతం నిధులు కేటాయించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం మార్త నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తోందని, దీంతో ప్రభుత్వ విద్యాసంస్థలు విశ్వ విద్యాలయాలు, గురుకులాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని లేదా అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గూడ సాయిరాం, బిందు, వంశీ, ఐశ్వర్యయ్య, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

రాయపర్తి: మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కొట్టుకొచ్చిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై బండారి రాజు తెలిపారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కవేడుకు చెందిన ఇజ్జగిరి సాంబయ్య ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి తన కుటుంబంతో సహా నర్సంపేటకు బతుకుదెరువు కోసం వెళ్లాడు. సాంబయ్య పెద్దకుమారుడు మృతుడు ఇజ్జగిరి రాజు(31)ను ఏమీ పని చేయడంలేదని తండ్రి మందలించడంతో జనవరి 31న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఆవేశంతో బయటకు వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి రాకపోవడంతో నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మైలారం రిజర్వాయర్‌లోకి మృతదేహం కొట్టుకువచ్చినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా గుర్తించి నిర్ధారణ చేసినట్లు తెలిపారు.

ఆయిల్ పామ్ మిల్లు కోసం భూ పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం గ్రామాల్లోని సీలింగ్ మిగులు భూములను ఆర్డీఓ మహేందర్‌జీ శనివారం పరిశీలించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఆయిల్‌పామ్ మిల్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సీలింగ్ మిగులు భూములైన సర్వే నంబర్ 369, 370, 371, 373లోని 43 ఎకరాల భూములను పరిశీలించారు. సోమవారం మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించేందుకు వస్తున్నందున ముందస్తుగా ఆభూములను పరిశీలించినట్లు తెలిపారు. ఆర్డీఓ వెంట ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, తహసీల్దార్ కుసుమ సత్యనారాయణ, సర్పంచ్‌లు కుక్కల భాస్కర్, గజవెల్లి అనంతప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లులారా.. మళ్లొస్తం

ముగిసిన మినీ మేడారం




క్యూలో భక్తుల సందడి


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు




ఎత్తు బంగారం(బెల్లం)తో తరలివస్తున్న భక్తులు

- నాలుగు రోజుల పాటు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన గద్దెల ప్రాంగణాలు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మినీ మేడారం జాతర ఘనంగా ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తులు వన దేవతలకు తీరుబడిగా మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. జంపన్నవాగు మొదలు గద్దెల వరకు, అక్కడి నుంచి చిలకలగుట్ట వరకు వాహనాలతో నిండిపోయింది. మినీ జాతర (మండమెలిగె పండుగ)తో నాలుగు రోజుల పాటు మేడారం భక్తులతో కళకలాడింది.

నాలుగు రోజులు ఘనంగా..

బుధవారం మండమెలిగే వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం వరకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వీటికి అదనంగా స్వంత వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి బారులుదీరారు. జంపన్న వాగు స్నానఘట్టాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరావు, జంపన్న వసతి సముదాయాలు భక్తులతో నిండిపోయాయి. ఇవి కాకుండా రెడ్డిగూడెం, ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరిసర ప్రాంతాల్లోనూ భక్తులు బస చేశారు.

కొనసాగుతున్న భక్తుల రాక

బుధవారం మొదలైన జాతర శనివారంతో ముగిసినప్పటికీ ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వన దేవతలను దర్శనం చేసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా పౌర్ణమి, వీకెండ్ కలసి రావడంతో హైదరాబాద్ నుంచి వివిధ ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి చేరుకుంటున్నారు. దీంతో మినీ జాతర ముగిసినా మేడారంలో భక్తుల కోలాహలం తగ్గలేదు.

తనివితీరా మొక్కులు

కరోనా కారణంగా చాలా మంది భక్తులు గత జాతర సందర్భంగా మేడారం వచ్చేందుకు సంశయించారు. ప్రస్తుతం కరోనా భయం తగ్గిపోవడంతో మినీ మేడారం జాతరకు ఈసారి భక్తులు పోటెత్తారు. వన దేవతలకు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో నిలువెత్తు బంగారం, ఒడి బియ్యం సమర్పించారు. యాటలు, కోళ్లను తల్లులకు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

> **తిరుగువారం పండుగ**
>
> మేడారం మినీ జాతర ముగిసిన తర్వాత ఈనెల 8వ తేదీన (బుధవారం) సమ్మక్క సారలమ్మ పూజారులు తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మేడారంలోని సమ్మక్క గుడిలో, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు తిరుగువారం పండుగ పూజలు చేస్తారు. అమ్మవార్ల ఆలయాలను శుద్ధి చేసి దూపాదీపాలు వెలిగించి యాటలను మొక్కుగా సమర్పిస్తారు. తిరుగువారం పండుగతో పూజలు పరిసమాప్తం కానున్నాయి.

పకడ్బందీ ఏర్పాట్లు

మినీ జాతరకు జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. దేవాదాయ, మెడికల్, ఐసీడీఎస్, ఐటీడీఏ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో సిబ్బందికి జాతర విధులు అప్పగించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ కంట్రోల్ బాధ్యతల్లో నాలుగు వందల మందికి పైగా పోలీసులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లా నుంచే కాకుండా ఆంధ్ర నుంచి కూడా కార్మికులను రప్పించారు.

పారిశుద్ధ్య సేవలు భేష్



పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో డీపీఓ వెంకయ్య పర్యవేక్షణలో జాతరలో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడా లోపాలు తల్లెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సేకరించిన చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డులకు తరలించారు. జాతరలో కార్మికులు అందించిన పారిశుద్ధ్య సేవలను భక్తులు, అధికారులు మెచ్చుకున్నారు. మినీ జాతర ముగిసిన మరో వారం రోజుల పాటు పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటామని డీపీఓ వెంకయ్య తెలిపారు. అంతేకాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతరలో మూడు శిబిరాల ద్వారా తప్పిపోయిన భక్తులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెలవెలబోయిన 'హరిత'

మినీ జాతరకు వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కళకళలాడితే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన హరితా హోటల్ వెలవెలబోయి కన్పించడం గమనార్హం. గదుల ధర అధికంగా ఉండటం, నిర్వహణ లోపాలు, సరైన ప్రచారం లేకపోవడంతో హరిత ప్రాంగణం వెలవలబోయింది. కనీసం క్యాంటీన్‌లో సైతం జన సందడి కనిపించలేదదంటే పరస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మినీ జాతరను పురస్కరించుకుని ఇక్కడ నిర్మించిన అంఫీ థియేటర్‌లో ఏమైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు అభిప్రాయపడ్డారు. కాగా, గిరిజన మ్యూజియం భక్తుల సందర్శనతో సందడిగా మారింది.

> **సమన్వయంతో జాతర విజయవంతం**
>
> 
>
> సమ్మక్క- సారలమ్మ మినీ జాతర విజయవంతమైంది. అధికారుల సమన్వయంతోనే ఇది సాధ్యమైంది. మినీ జాతరలో సేవలందించిన జిల్లా అధికారయంత్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు. నేడు (ఆదివారం) మాఘశుద్ధ పౌర్ణమి రోజు కావడంతో భక్తులు భారీగా తరలి రానున్నారు.
>
> – సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తవ్..

హన్మకొండ: ములుగు నుంచి పాదయాత్ర చేయాలనుకుంటున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి.. ఇక్కడి ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రెడ్‌కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా ఏనాడైనా జిల్లా అభివృద్ధిపై పార్లమెంట్‌లో మాట్లాడినవా..? ములుగుకు ప్రత్యేకంగా ఏమైనా నిధులు అడిగినవా..? పదేళ్ల రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మేడారానికి జాతీయ హోదా ఎందుకు ఇయ్యలేదు..? ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తావని ఆయన ఒక ప్రకటనలో తూర్పారబట్టారు. రామప్ప అభివృద్ధి, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఎనాడైనా కేంద్రాన్ని నిలదీశావా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క రామప్ప అభివృద్ధి విషయంలో జరుగుతున్న అన్యాయంపై, మేడారం పండుగకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీపై రాహుల్ గాంధీతో పార్లమెంట్‌లో ఎందుకు అడిగించలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది ఐరన్ లెగ్ అని సీతక్క గ్రహించాలని సూచించారు.

భవన నిర్మాణాలకు రూ.15 కోట్లు మంజూరు


ప్రొసీడింగ్ కాపీ అందుకుంటున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట: నర్సంపేటలో కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రూ.15కోట్లు నిధులు మంజూరు అయినట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో నిధుల విడుదల పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కోర్టు స్టే తెచ్చినప్పటికీ ప్రభుత్వ సహకారంతో రెట్టింపు నిధులు విడుదల చేయించుకున్నట్లు తెలిపారు. ప్రతీ కుల సంఘానికి సొంత భవనాన్ని నిర్మిస్తామన్నారు.

పాకాలలో విద్యార్థుల సందడి



ఖానాపురం: మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాకాలలో నిట్ విద్యార్థులు సందడి చేశారు. పలువురు విద్యార్థులు శుక్రవారం సాయంత్రం పాకాలకు చేరుకుని ఉత్సాహంగా గడిపారు. ఇటీవల ఏర్పాటు చేసిన జంగిల్ క్యాంపింగ్‌లో బస చేశారు. శనివారం ఉదయం క్యాంపింగ్ మేనేజర్ ముత్యాల పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ చేశారు. పాకాల అందాలు వీక్షించారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం


- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- ఇద్దరు మిత్రులు దుర్మరణం


ప్రశాంత్(ఫైల్)


నవీన్(ఫైల్)

కొడకండ్ల: చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న ఇద్దరు ప్రాణ మిత్రులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండా శివారు పెట్రోల్ పంపు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పణిగిరి గ్రామానికి చెందిన నాతి ప్రశాంత్(19), బొడ్డు నవీన్ (20)లు గ్లామర్ బైక్‌పై జనగామ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిర్నితండా పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడిపోయారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో ఇద్దరు మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కొమురెల్లి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్న మిత్రులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నియామకం


రవికృష్ణ గౌడ్

హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి కృష్ణను నియమించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన బైరి రవికృష్ణను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ మాట్లాడారు. పది సంవత్సరాలుగా వివిధ హోదాల్లో బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనను నియమించిన జాజుల శ్రీనివాస్ గౌడ్‌తోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలన చేతకాకుంటే పారిపోవాలి..

- బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి..
- వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల


కొంకపాకలో పాదయాత్ర చేస్తున్న షర్మిల

పర్వతగిరి/సంగెం: మీకు దమ్ము, ధైర్యం ఉంటే మంచి పాలన అందించాలని, పాలన చేతకాకపోతే వదిలి పారిపోవాలని వైఎస్సార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర సందర్భంగా శనివారం మండలంలోని చౌటపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పర్వతగిరి మండలంలో పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు వైఎస్సార్ టీపీ ఫ్లెక్సీలను చించివేయడం, ఇటీవల జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులకు చాలెంజ్ విసురుతున్నానని, మీ దాడులకు వైఎస్సార్ బిడ్డ భయపడదన్నారు. మేము చేస్తున్న ఆరోపణల్లో తప్పులు ఉంటే పబ్లిక్ ఫోరం పెట్టాలని, మీడియా, ప్రతిపక్షాలను పిలిపిద్దామా.. అంటూ సవాల్ విసిరారు. అధికారం ఉంది కదా, పోలీసులు ఉన్నారు కదా.. అని దాడులు చేస్తే ఊరుకోమని, మా జోలికొస్తే ఇంకా గట్టిగా మాట్లాడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండాలని హితవుపలికారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేలు ఎవరూ లేరన్నారు. ఎమ్మెల్యే అరూరి రమేష్ భూకబ్జాలు వాస్తవాలు కాదా.. అని, ఆయనపై చేసిన ఆరోపణలు ప్రజలు చెప్పినవేనన్నారు. భూములు ఇవ్వకపోతే థర్డ్ డిగ్రీలు ప్రయోగించడం వాస్తవం కాదా.. అంటూ ప్రశ్నించారు. స్వయంగా మంద కృష్ణ మాదిగ భూములు కూడా ఎమ్మెల్యే అరూరి కబ్జా చేయాలనుకోవడం వాస్తవం కాదా.. అని నిలదీశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు సర్పంచ్‌ల పక్షాన ఏరోజైనా నిలబడ్డారా.. అనే విషయాన్ని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, మల్లేశంగౌడ్, అప్పం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ మహానగరం నక్కలపెల్లిలో ఆదివారం ఉదయం 9గంటలకు వైఎస్ఆర్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి శనివారం తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్


మరిపెడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

మరిపెడ: అక్రమంగా తరలిస్తున్న 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తొర్రూర్ డీఎస్పీ రఘు మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వెల్లడించారు. మండలంలోని పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై పోలీసులు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానంగా కనిపించడంతో విచారించి, వారి వద్ద రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని కుక్కల తండాకు చెందిన బానోతు రమేష్, దూబ్లా అను పా డేరు ప్రాంతం నుంచి రెండు కిలోల గంజాయి తీసుకొచ్చిన విషయాన్ని ఇస్లావత్ హనుమకు చెప్పారు. గంజాయిని రూ.10వేలకు కిలో చొప్పున హనుమ కు అప్పగించి మాట్లాడుతున్న క్రమంలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు. సమావేశంలో సీఐ సాగర్, ఎస్సై పవన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: హనుమకొండ నగరంలోని పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో సుమారు రూ.26వేలు విలువ గల గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, ఓ బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.14,200 స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన సాంబరాజు హేమంత్, జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం సూరంపేట వాసి మంతిని శ్రీనివాస్‌లు ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ అభ్యసిస్తున్నాడు. కోడిమ్యాలకు చెందిన మల్లేశం వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కాగా, పెగడపల్లి డబ్బాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మల్లేశం పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, నిశార్ పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో..

రామన్నపేట: వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఒకరి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్సై శివకుమార్, కానిస్టేబుల్‌లు భిక్షపతి, శశికుమార్‌లతో కలిసి తనిఖీలు నిర్వహించగా ఓ యువకుడు చేతిలో కవర్ పట్టుకుని అనుమానాస్పదంగా కనిపిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద రూ.10వేల విలువ చేసే గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. దీంతో అతడిని విచారించగా గోవిందరాజుల గుట్ట ప్రాంతానికి చెందిన ఎండీ అజార్ అని తెలిసిందని తెలిపారు. అజార్ ఏడాది కాలంగా రైల్వే స్టేషన్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. దీంతో అజార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేష్ తెలిపారు.